

ఉన్నత పాఠశాలల స్థాయి పెంపు
విద్యారంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. ఉన్నత పాఠశాలల్లో కళాశాల విద్యను బోధిస్తోంది. భవిష్యత్తును బంగారుమయం చేస్తోంది.
- 8లో



వాలీబాల్ పోటీల్లో ఎల్.కోట విజేత
క్రీడల్లో రాణించేవారికి ఉజ్వల భవిషత్తు ఉంటుందని ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు అన్నారు. వాలీబాల్ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.
- 8లో



నూతన కోర్సులతో నైపుణ్యం మెరుగు
- 8లో
పరిశోధన రంగంలో నైపుణ్యాలు మెరుగుపరచుకోవాలని జేఎన్‌టీయూ (జీవీ) వీసీ ప్రొఫెసర్ కె. వెంకటసుబ్బయ్య విద్యార్థులకు పిలుపునిచ్చారు.

న్యూస్‌రీల్

ఏపీ టెట్-2024కు ఏర్పాట్లు పూర్తి



టెట్ పరీక్ష కేంద్రమైన సీతం ఇంజినీరింగ్ కళాశాలను తనిఖీ చేస్తున్న టెట్ పరిశీలకుడు సుబ్బారెడ్డి

విజయనగరం అర్బన్: జిల్లాలో సోమవారం నుంచి వచ్చేనెల 6వ తేదీ వరకు జరిగే ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్-2024) కోసం ఏర్పాట్లు పూర్తిచేశామని టెట్ పరిశీలకుడు, మధ్యాహ్నభోజన పథకం రాష్ట్ర సహాయ సంచాలకుడు ఎ.సుబ్బారెడ్డి తెలిపారు. టెట్ పరీక్ష కేంద్రాలు సీతం ఇంజినీరింగ్, ఎంవీజీఆర్, లెండి ఇంజినీరింగ్ కళాశాలను తనిఖీ చేశారు. వసతుల కల్పనపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం డీఈఓ చాంబర్‌లో డీఈఓ ప్రేమకుమార్‌తో కలిసి టెట్ ఏర్పాట్లను వెల్లడించారు. ప్రతిరోజూ ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్స్‌లో ఆన్‌లైన్ విధానంలో టెట్ పరీక్ష జరుగుతుందని తెలిపారు. జిల్లాలో మొత్తం 11,530 మంది అభ్యర్థులు ఆరు కేంద్రాల్లో పరీక్షరాస్తారని వివరించారు.

అభ్యర్థులకు సూచనలు
అభ్యర్థుల హాల్ టికెట్‌తో పాటు ఏదైనా ఒరిజినల్ ఐడీ ప్రూఫ్ తీసుకొని వెళ్లాలి. పరీక్ష కేంద్రానికి కనీసం 30 నిమిషాల ముందు చేరుకోవాలి. దివ్యాంగులకు స్క్రైబ్‌ను ఏర్పాటు చేస్తారు. 50 నిమిషాల సమయం అదనంగా కేటాయిస్తారు. సందేహాల నివృత్తికోసం హెల్ప్‌డెస్క్ నంబర్లు: 98497 39920, 94933 13271, 83285 75612ను సంప్రదించవచ్చు.

లింగనిర్ధారణ పరీక్ష చేస్తే ఖబడ్దార్..!



వైద్యాధికారులతో సమీక్షిస్తున్న ఇన్‌చార్జ్ ఆర్‌డీఓ

బొబ్బిలి: డివిజన్‌లోని స్కానింగ్ సెంటర్లలో లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి ఆర్‌డీఓ కె. సందీప్‌కుమార్ హెచ్చరించారు. స్థానిక ఆర్‌డీఓ కార్యాలయంలో డివిజన్‌లోని వైద్యాధికారులు, సిబ్బందితో పీసీ, పీఎన్‌డీటీ చట్టం అమలుపై సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్లల పట్ల వివక్షతో లింగనిర్ధారణ, గర్భస్రావాలు చేస్తున్నందున లింగ నిష్పత్తి పెరిగిపోయిందన్నారు. మూఢ నమ్మకాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్న సెంటర్ల ఆచూకీ తెలిస్తే సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ గుల్ల సంతోషి కుమారి, వైద్యులు పద్మావతి, స్వాతి, ఏఎస్సై బీవీ రమణ, దీక్షా మహిళా సొసైటీ సీఈఓ ఎల్ శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోపై సమీక్ష
మున్సిపల్ కార్యాలయంలో వచ్చే నెల 3 నుంచి జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమంపై వైద్య సిబ్బందితో మున్సిపల్ కమిషనర్ ఎల్. రామలక్ష్మి సమీక్ష నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ పల్స్‌పోలియో నిర్వహించాలని ఆదేశించారు. పుట్టిన పిల్లల నుంచి 5 సంవత్సరాల మధ్య వయసు గల వారందరికీ తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలన్నారు. సమీక్షలో అర్బన్ వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరుగురు తహసీల్దార్లకు స్థాన చలనం

విజయనగరం అర్బన్: జిల్లాలోని ఆరుగురు తహసీల్దార్లను బదిలీచేస్తూ కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సోమవారం ఆదేశాలు జారీచేశారు. ఎన్నికల నేపథ్యంలో ప్రస్తుతం జిల్లాలో పనిచేస్తున్న ఆరుగురికి ఇదే జిల్లాలోని వేర్వేరు మండలాలకు బదిలీ చేశారు. బదిలీ అయిన వారి వివరాలు ఇలా ఉన్నాయి.

తహసీల్దార్ పేరు	పనిచేస్తున్న స్థానం	బదిలీ స్థానం
ఎస్.కిరణ్‌కుమార్	బొబ్బిలి	ఎస్.కోట
వి.త్రినాథరావునాయుడు	మెంటాడ	బొబ్బిలి
ఎస్.దిలీప్‌చక్రవర్తి	తెర్లాం	మెంటాడ
బి.సత్యం	గరివిడి	వేపాడ
డి.శ్రీనివాసరావు	ఎస్.కోట	గరివిడి
కె.ప్రసన్న కుమార్	వేపాడ	తెర్లాం

ఆరోగ్యకర ఆహారం

- గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ
- ఐసీడీఎస్ ద్వారా వైఎస్సార్ సంపూర్ణ కిట్లు అందజేత
- ఏడాదికి 25 వేలు కిట్లు అందిస్తున్న ప్రభుత్వం
- 2019 నుంచి ఇప్పటి వరకు రూ.27.09 కోట్లు ఖర్చు
- జిల్లాలో 2,499 అంగన్‌వాడీ కేంద్రాలు
- రాగి పిండి, అటుకులు, చెక్కీలు, బెల్లం, కర్జూరం అందజేత
- బలవర్థకమైన ఆహారంతో లబ్ధిదారుల్లో పెరుగుతున్న హెచ్‌బీ శాతం



విజయనగరం బీసీ కాలనీలో గర్భిణులు, బాలింతలకు గుడ్లు, వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

విజయనగరం ఫోర్ట్:

గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. నెల నెలా వైద్యపరీక్షలతో పాటు ఆరోగ్యకర ఆహారాన్ని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేస్తోంది. వారిలోని రక్తహీనతను నివారిస్తోంది. సుఖప్రసవాలను ప్రోత్సహిస్తోంది. ఆరోగ్యకర సమాజ నిర్మాణమే లక్ష్యంగా పనిచేస్తోంది.

ప్రతినెలా పోషణ కిట్లు సరఫరా
అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్టును ప్రతినెలా అందిస్తోంది. గర్భిణీ ఆరోగ్యంగా ఉండడానికి, వారిలో హిమో గ్లోబిన్ శాతం పెరగడానికి రాగి పిండి (2 కేజీలు), అటుకలు (కేజీ), చెక్కీలు (పావుకేజీ), బెల్లం (పావు కేజీ), కర్జూరం (పావుకేజీ), 25 గుడ్లు, 5 లీటర్ల పాలుతో కూడిన కిట్టును ప్రభుత్వం సమకూర్చుతోంది.

2019 నుంచి 2024 జనవరి నెలఖారు వరకు ప్రభుత్వం అందించిన కిట్ల వివరాలు:

సంవత్సరం	అందించిన కిట్లు
2019-20	17,220
2020-21	24,796
2021-22	31,456
2022-23	24,678
2023-24	20,899

జిల్లాలో పంపిణీ ఇలా..
జిల్లాలో 2,499 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో 7 నెలల నుంచి 3 సంవత్సరాల లోపు పిల్లలు 44,745 మంది, 3 నుంచి 6 సంవత్సరాల లోపు పిల్లలు 23,255 మంది ఉన్నారు. గర్భిణులు 9,930 మంది, బాలింతలు 9,668 మంది ఉన్నారు. ఏటా 25 వేలు నుంచి 30 వేల కిట్లను అందిస్తోంది. 2019 నుంచి ఇప్పటి ఇప్పటి వరకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల కోసం ప్రభుత్వం రూ.27.09 కోట్లు వెచ్చించింది. ఆరోగ్యభాగ్యం కల్పిస్తోంది.



గంట్యాడ మండలం మధుపాడలో గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ కిట్టును అందజేస్తున్న సీడీపీఓ ఉమాభారతి

మంచి ఆహారం



వైఎస్సార్ సంపూర్ణ పోషణ కింద ప్రభుత్వం అందించిన పౌష్టికాహారం కిట్టు ఎంతగానో ఉపయోగపడుతోంది. రక్తహీనతను నివారించే ఆహారం అందిస్తుండడం ఆనందంగా ఉంది. రాగి పిండి, కర్జూరం, చెక్కీలు, పాలు, గుడ్లు తీసుకోవడం వల్ల హిమోగ్లోబిన్ శాతం పెరిగింది. ఎటువంటి ఇబ్బంది లేకుండా సుఖ ప్రసవం జరిగింది.
– అరసాడ దీప్తి, బాలింత, సాలిపేట, విజయనగరం

ఆరోగ్యంపై శ్రద్ధ



ప్రభుత్వం మాతాశిశు సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తోంది. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల ద్వారా పౌష్టికాహారం సరఫరా చేస్తోంది. ప్రతిరోజు రాగి పిండితో జావ చేసుకుని తాగుతున్నాను. గర్భిణుల ఆరోగ్యం కోసం ఉచిత వైద్యంతో పాటు ఆహారం అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి కృతజ్ఞతలు.
– సీహెచ్ సాయికుమారి, చినతామరపల్లి, బొండపల్లి మండలం

రక్తహీనత నివారణే లక్ష్యం
గర్భిణుల్లో రక్తహీనత నివారణ, సుఖ ప్రసవం, ఆరోగ్యకర బిడ్డల జననం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. గర్భిణులకు నెలనెలా వైద్య పరీక్షలతో పాటు ఆరోగ్యకర ఆహారాన్ని అంగన్‌వాడీల ద్వారా ఇంటి వద్దకే పంపిణీ చేస్తోంది. దీనివల్ల గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత సమస్య చాలావరకు తగ్గింది. ప్రసవాల సమయంలో ఆరోగ్య సమస్యలు తగ్గాయి. ఆరోగ్యవంతమైన పిల్లలు జన్మిస్తున్నారు.
– బి.శాంతకుమారి, పీడీ, ఐసీడీఎస్

జనసేనకు సహకరించం

- బంగారాజుకు సీటు ఇవ్వకపోతే ఇండిపెండెంట్‌గా నామినేషన్
- అత్యవసర సమావేశంలో టీడీపీ రెండో వర్గం నాయకులు వెల్లడి

పూసపాటిరేగ: నెల్లిమర్ల టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థిగా లోకం మాధవిని ప్రకటించడంపై టీడీపీ శ్రేణుల్లో నైరాశ్యం అలముకుంది. చంద్రబాబు తీరును ఓ వైపు దుమ్మెత్తిపోస్తూ... వేర్వేరుగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. మాధవిని ఓడించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. పూసపాటిరేగలోని ఓ ప్రైవేటు హోటల్‌లో టీడీపీ నాయకులు వెంపడాపు సూర్యనారాయణ, ఇజ్జురోతు ఈశ్వరరావు, ఆకిరి ప్రసాదరావు ఆధ్వర్యంలో టీడీపీ రెండో వర్గం నాయకులు సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 95 శాతం ఓట్లు ఉన్న టీడీపీకి టికెట్ కేటాయించకుండా, 5 శాతం ఓట్లు ఉన్న జనసేనకు టికెట్ కేటాయించడంతో జనసేనకు సహకరించే ప్రసక్తే లేదని తెగేసి చెప్పారు. బంగారాజు ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తే మద్దతు ఇస్తామని, ఆయన పోటీ నుంచి తప్పుకుంటే నెల్లిమర్ల నియోజకవర్గం ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థిగా రెల్లివలసకు చెందిన ఇజ్జురోతు ఈశ్వరరావు పోటీలో ఉంటారని సమావేశంలో తీర్మానించారు. పూసపాటిరేగలో జరిగిన టీడీపీ అత్యవసర సమావేశానికి పూసపాటిరేగ, పేరాపురం, వెంపడాం, పతివాడ, చల్లవానితోట, నడిపల్లి, చౌడువాడ, గోవిందపురం, అల్లాడపాలెం పంచాయతీలకు చెందిన టీడీపీ నాయకులు అత్యవసర సమావేశానికి హాజరు కాలేదు. కొందరు నాయకులు పార్టీని వీడేందుకు సిద్ధమవుతున్నారు. సమావేశంలో టీడీపీ నాయికులు డి.సూర్యనారాయణరాజు, దువ్వ అప్పలస్వామి, గొట్టాపు అప్పలస్వామి, పీతల మంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యనారాయణ, ఈశ్వరరావు, ప్రసాదరావు తదితరులు

సంక్షేమ పాలనకు ఫిదా

- 500 కుటుంబాలతో టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వరహాలనాయుడు
- పార్టీ కండువాలు వేసి ఆహ్వానించిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ
- మంచి చేశామంటేనే మరోసారి ఓటు వేసి మద్దతు ఇవ్వండి

చీపురుపల్లి: జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పాలనకు ప్రజామద్దతు సంపూర్ణంగా లభిస్తోంది. అర్హతే కొలమానంగా సంక్షేమ పథకాలు అందడంతో ప్రతిపక్ష పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా ఫిదా అవుతున్నారు. సంక్షేమ పాలనలో భాగస్వాములయ్యేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. తమ అనుచరులతో వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. అదే కోవలో చీపురుపల్లి జెడ్పీటీసీ మాజీ సభ్యుడు, టీడీపీ సీనియర్ నాయకుడు మీసాల వరహాలనాయుడు, చీపురుపల్లి మేజర్ పంచాయతీ మాజీ సర్పంచ్ మీసాల సరోజిని, వైద్యుడు డా.ఆర్.విజయసారథితో పాటు దాదాపు 500 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. చీపురుపల్లి మూడురోడ్ల కూడలిలో సోమవారం సాయంత్రం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మంత్రి బొత్స సత్యనారాయణ వీరందరికీ వైఎస్సార్ సీపీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. సంక్షేమ పాలనకు మద్దతు ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీపురుపల్లి పేరు రాష్ట్రవ్యాప్తంగా వినిపించేలా అభివృద్ధి చేసినట్టు వెల్లడించారు. నియోజకవర్గ ప్రజలు ఇచ్చిన మద్దతుతో లభించిన పదవులతోనే ఇది సాధ్యమైందన్నారు. 2004 నుంచి 2014 వరకు, 2019 నుంచి 2024 వరకు తన హయాంలో నియోజకవర్గ ప్రజలకు, ఈ ప్రాంతానికి మేలు జరిగిందని భావిస్తేనే ఓటుతో మద్దతు పలకాలని కోరారు. అభివృద్ధి, ప్రజాసేవ, సంక్షేమ పాలనను పారదర్శకంగా అమలుచేస్తుండడం వల్లే ప్రజలను ధైర్యంగా ఓట్లు అడగ గలుగుతున్నామని చెప్పారు. 2004లో వర్షాల కోసం ఆకాశం వైపు చూసే పరిస్థితులు ఉండేవని, దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ చలువతో ఈ ప్రాంతానికి తోటపల్లి కాలువ తీసుకొచ్చామన్నారు. 2019 తరువాత నియోజకవర్గం ముఖచిత్రం మరింత మారిందన్నారు. తాజాగా చీపురుపల్లి సీహెచ్‌సీను వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయడంతో పాటు వైద్య సిబ్బందిని, ఆధునిక పరికరాలను సమకూర్చినట్టు వెల్లడించారు.

టీడీపీ శ్రేణులకు ఆహ్వానం
జిల్లాను, నియోజకవర్గాన్ని కలిసికట్టుగా అభివృద్ధి చేసుకునేందుకు టీడీపీ శ్రేణులను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్నామని పార్టీ రీజనల్ డిప్యూటీ కోఆర్డినేటర్, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ప్రస్తుత టీడీపీలో రాబోయే ఎమ్మెల్యే అభ్యర్థి ఇక్కడ శాశ్వతం కాదని గుర్తు చేసుకోవాలన్నారు. ఎన్నికలు వరకే రాజకీయం చేశామే తప్ప ఎన్నికలయ్యాక ఎవరిపైనా ఎలాంటి కక్ష సాధింపు చర్యలు తీసుకోలేదని, అందరికీ సంక్షేమ పాలన అందేలా చూశామన్నారు. తమకు ఓట్లు వేయకపోయినా, తమతో పని చేయకపోయినా తమ వద్దకు వచ్చే ప్రతి ఒక్కరికీ సేవలు అందించామని గుర్తుచేశారు. పార్టీలు పక్కన పెట్టి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుకునేందుకు భాగస్వామ్యం కావాలన్నారు.

కరోనా కష్ట కాలంలో టీడీపీ నేతలు ఏమయ్యారు...
కరోనా మహమ్మారి విలయతాండవం చేస్తున్న సమయంలో ప్రజలు ఎలా ఉన్నారో కనీసం పట్టించుకోని టీడీపీ నేతలు ఎన్నికల ముందు మళ్లీ ఓట్లు కోసం ఏ ముఖం పెట్టుకుని వస్తారని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ప్రశ్నించారు. ఎంపీగా, కేంద్రమంత్రిగా పని చేసిన అశోక్‌గజపతిరాజు జిల్లా అభివృద్ధిని విస్మరించారన్నారు. గత ప్రభుత్వ హయాంలో భోగాపురం ఎయిర్‌పోర్ట్ పనులు ఒక్క అడుగు కూడా కదలలేదన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషితో ఎయిర్‌పోర్టు పనులు ప్రారంభమయ్యాయని, రూ.500 కోట్లతో మెడికల్ కళాశాల ప్రారంభించారని చెప్పారు.

పార్టీలో చేరికలు ఇలా...
రావివలస మాజీ ఎంపీటీసీ సభ్యుడు కురిమి నాయుడు, వార్డు మెంబర్ కంచుపల్లి అశోక్, మాజీ వార్డు మెంబర్లు గవిడి సురేష్, కందుల కృష్ణ, అడ్డూరి కృష్ణ, రెడ్డి దాము, రెడ్డి త్రినాథ్, మీసాల వెంకటేష్, మీసాల హరిలతో పాటు బోడసింగి సత్యం, రొబ్బి చిన్ని, యల్లంటి శివ, పట్నాన వెంకటరమణ తదితర 500 కుటుంబాలు వరకు ఆ పార్టీను వీడారు. వీరందరికీ మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు వలిరెడ్డి శిరీష, మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, ధీర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డా.బొత్స సందీప్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, పతివాడ రాజారావు తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీలో చేరిన జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వరహాలనాయుడు, మాజీ సర్పంచ్ సరోజినిలకు పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ



టీడీపీను వీడి వైఎస్సార్ సీపీలో చేరేందుకు వచ్చిన కార్యకర్తలు

టీడీపీలో అవగాహన లేని నాయకులు



నియోజకవర్గ టీడీపీలో అవగాహన, దిశ, దశలేని నాయకులే ఉన్నారని, వారికి అభివృద్ధిపై కనీస ఆలోచన లేదని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మీసాల వరహాలనాయుడు అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పాలన బాగుందని, మంత్రి బొత్స సత్యనారాయణ నాయకత్వంలో పని చేసేందుకు వైఎస్సార్‌సీపీలో చేరినట్టు వెల్లడించారు. చీపురుపల్లి వాసులకు సెంటిమెంట్‌గా ఉన్న కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర విషయంలో కూడా గతంలో పనిచేసిన టీడీపీ ఎమ్మెల్యేకు చిన్న చూపు ఉండేదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అర్హతే కొలమానంగా సంక్షేమ పథకాలు మంజూరు చేస్తోందని, టీడీపీ శ్రేణుల ఖాతాలకు కూడా పథకాల ఆర్థిక ప్రయోజనం జమైందన్నారు. ఇంతకంటే మంచిపాలన ఎవరూ అందించ లేరన్నారు.

జిల్లాలో నాలుగు రైల్వే ప్రాజెక్టులకు శంకుస్థాపన

- వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన ప్రధాని నరేంద్రమోదీ
- అమృత్ భారత్ స్టేషన్లుగా చీపురుపల్లి, కొత్తవలస, బొబ్బిలి
- జిల్లా కేంద్రంలో రైలు వంతెన నిర్మాణం



శిలాఫలకం ఆవిష్కరణలో పాల్గొన్న బీజేపీ నాయకులు, రైల్వే అధికారులు

విజయనగరం టౌన్: అమృత్‌భారత్‌లో భాగంగా జిల్లాలో మూడు రైల్వేస్టేషన్లను అభివృద్ధికి, విజయనగరం బీసీ కాలనీ ప్రాంతంలో రైల్వేట్రాక్‌పై నిర్మించనున్న ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులకు భారత ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. రూ.48.98 కోట్లతో రైల్వే వంతెన పనులు, రూ.18.77 కోట్లతో కొత్తవలస స్టేషన్, రూ.21 కోట్లతో చీపురుపల్లి, రూ.16 కోట్ల ఖర్చుతో బొబ్బిలి స్టేషన్‌ను అభివృద్ధి చేయనున్నారు. నగరంలోని మ్యాంగోయార్డ్ వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో నగర కార్పొరేటర్లు చందక శ్రీను, బి.పద్మావతి, వాల్తేర్ డిప్యూటీ చీఫ్ సిగ్నలింగ్ టెలికం ఇంజినీర్ సీహెచ్‌వీ కారుణ్య, బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు భవిరెడ్డి శివప్రసాదరెడ్డి తదితరులు పాల్గొని ఓవర్ బ్రిడ్జి పనుల శంకుస్థాపన శిలాఫలకం ఆవిష్కరించారు. ఇప్పటికే విజయనగరం రైల్వే స్టేషన్ అభివృద్ధికి రూ. 35.16 కోట్లు విడుదల చేసినట్టు భవిరెడ్డి శివప్రసాదరెడ్డి తెలిపారు. అమృత్ భారత్ కార్యక్రమంపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం, పెయింటింగ్, క్విజ్ పోటీల్లో విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వీటీ అగ్రహారం జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం రాజేశ్వరరావు, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

అమృత్ భారత్‌తో రైల్వే స్టేషన్ల అభివృద్ధి



శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

కొత్తవలస: అమృత్‌భారత్ కార్యక్రమంతో రైల్వే స్టేషన్లు అభివృద్ధి చెందుతున్నాయని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. కొత్తవలస రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులకు రైల్వే అధికారులతో కలిసి సోమవారం భూమిపూజ చేశారు. ఆరు ప్లాట్‌ఫామ్స్, ఎక్స్‌లేటర్స్, ఫుట్‌ఓవర్ బ్రిడ్జి, అదనపు ప్రవేశ ద్వారం తదితరవి నిర్మించనున్నట్టు రైల్వే అధికారులు సి.ఆర్.దాస్, శివనరేష్, వాల్తేర్ డివిజన్ సీఎంఎస్ జ్యోతి, జె.వి.రావు, సాయి ఆనువట్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, సర్పంచ్ మచ్చరామస్వామి, పీఏసీఎస్ అధ్యక్షుడు గొరపల్లి శివ, స్టేషన్ మాస్టర్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

సంతోషంగా ఉంది...



మాట్లాడుతున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

బొబ్బిలి: విజయనగరం పార్లమెంట్ స్థానంలో విజయనగరం, చీపురుపల్లి, బొబ్బిలి రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేయడం ఆనందంగా ఉందని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. అమృత్ భారత్‌లో భాగంగా బొబ్బిలి స్టేషన్ ఆధునికీకరణ పనుల శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడుతో కలిసి పాల్గొన్నారు. పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసిన మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, డాక్టర్ వి.గణేష్, డివిజినల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ బి.వి.రమణ, అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ ఎస్ఎంకే పట్నాయక్, ట్రాక్ మెషీన్ చీఫ్ ఇంజినీర్ ఎ.కె.పాండే, ఏఎంసీ వైస్ చైర్మన్ తెంటు పార్వతి తదితరులు పాల్గొన్నారు.

పనిచేయని సిబ్బందిపై చర్యలు తీసుకోండి

- మంత్రి బొత్స సత్యనారాయణ



వ్యవసాయశాఖ జేడీ రామారావును నిలదీస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

మెరకముడిదాం: సక్రమంగా పనిచేయని సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని, ఎరువుల డబ్బులు కట్టకుండా ఎగ్గొట్టేవారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని వ్యవసాయశాఖ జేడీ వి.టి.రామారావు, ఏఓ శ్రావణితేజను రాష్ట్ర విద్యాశాఖమంత్రి బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. మెరకముడిదాం ఎంపీడీఓ కార్యాలయంలో మండలానికి చెందిన పలు శాఖలపై జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌తో కలిసి మంత్రి సమీక్షించారు. గర్భాం, సాతాంవలస గ్రామ సచివాలయాల్లో రెండు ఆధార్ నమోదు కేంద్రాలు సక్రమంగా పనిచేయకపోవడంతో చీపురుపల్లి ఆధార్ కేంద్రానికి వెళ్తున్నట్టు ఫిర్యాదులు వచ్చాయన్నారు. దీనిపై ఎంపీడీఓ ఎం.పావని, గర్భాం, సాతాంవలస పంచాయతీ కార్యదర్శులను ఆయన నిలదీశారు. సాఫ్ట్‌వేర్, లాప్‌టాప్ పనిచేయడంలేదన్న సమాధానంపై మండిపడ్డారు. తక్షణమే ఆధార్‌సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని జేసీ ఎం.కార్తీక్‌ను ఆదేశించారు. భూ సర్వేలో లోపాలు లేకుండా చూడాలని చీపురుపల్లి ఆర్డీఓ బి.శాంతి, తహసీల్దార్ వై.వి.పద్మావతికి జెడ్పీ చైర్మన్ సూచించారు. తాగునీటి సమస్యల పరిష్కారంపై చర్చించారు. మెరకముడిదాం గ్రామానికి చెందిన ఇళ్ల లబ్ధిదారులు 100 మందికి రిజిస్ట్రేషన్ పత్రాలను మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు, ఎంపీపీ తాడ్డివేణుగోపాలరావు, కోట్లవిశ్వేశ్వరరావు, కె.ఎస్.ఆర్.కె. ప్రసాద్, బూర్లెనరేష్‌కుమార్, వైస్ ఎంపీపీ టి.హరిబాబు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు పోలమాంబ ఆరవ జాతర


పోలమాంబ అమ్మవారు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి ఆరవ జాతర మంగళవారం జరగనుంది. జాతరకు వచ్చిన భక్తుల సౌకర్యార్థం ఈవో వీవీ సూర్యనారాయణ పర్యవేక్షణలో ఏర్పాట్లు చేపట్టారు. భక్తులకు అవసరమైన లడ్డు, పులిహోర ప్రసాదాలను తయారు చేయించారు. జాతరకు వచ్చిన భక్తులు ఇబ్బందులు పడకుండా సీఐ జి.బాలకృష్ణ, ఎస్సై నరసింహమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు.

డైట్ ప్రిన్సిపాల్ బాధ్యతల స్వీకరణ


డైట్ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న పగడాలమ్మ

నెల్లిమర్ల: నెల్లిమర్ల డైట్ ప్రిన్సిపాల్‌గా జి.పగడాలమ్మ సోమవారం బాధ్యతలు స్వీరించారు. పార్వతీపురం డీఈఓ(ఎఫ్ఏసీ)గా పనిచేస్తూ, ఇక్కడ రెగ్యులర్ ప్రిన్సిపల్‌గా ఆమె కొనసాగుతారు. బాధ్యతలు స్వీరించిన పాదాలమ్మను సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎన్‌టి నాయుడు, డైట్ లెక్చరర్స్ యు.మాణిక్యాల నాయుడు, జీవీఎస్ నాగేశ్వరరావు, డి ఈశ్వరరావు, ఎం.రామకృష్ణ, కె.రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ వెయిట్ లిఫ్టింగ్ విజేతలకు అభినందనలు


విజేతలను అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ శశిభూషణరావు

విజయనగరం అర్బన్: అరుణాచల ప్రదేశ్ రాజధాని ఈటానగర్‌లో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో వివిధ విభాగాల్లో పతకాలు సాధించిన స్థానిక సత్య డిగ్రీ, పీజీ కళాశాల క్రీడాకారులను కళాశాల యాజమాన్యం అభినందించింది. ఈ మేరకు కళాశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో విజేతలు ఎస్.పల్లవి(64కేజీల విభాగంలో రజత పతకం), సీహెచ్ శ్రీలక్ష్మి (81 కేజీల విభాగంలో బంగారు పతకం)లను, వెయిట్‌లిఫ్టింగ్ కోచ్ చల్లా రామును కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వీసాయిదేవమణి, కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్లు కెప్టెన్ ఎం.సత్యవేణి, ఎం.ఉదయ్‌కిరణ్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ బి.సూరపునాయుడు తదితరులు అభినందించారు.

80 లీటర్ల సారా పట్టివేత

సీతంపేట: సీతంపేట ఏజెన్సీలోని కొప్పెరడంగ్ ప్రాంతంలో 80 లీటర్ల సారా పట్టుకుని సీజ్ చేసినట్టు ఎస్సై జగదీష్‌నాయుడు తెలిపారు. కుడ్డపల్లికి వెళ్తుండగా మార్గమధ్యంలో సారా బట్టీలపై దాడులు చేసి సారా తయారీకి వినియోగించనున్న 1600 లీటర్ల పులిసిన బెల్లం ఊటలు కూడా ధ్వంసం చేశామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆకట్టుకున్న డాగ్ షో


డాగ్ షో ప్రథమ విజేత లాబ్రడార్‌తో యజమానులు

పర్లాకిమిడి: స్థానిక ఆర్.సీతాపురం సెంచూరియన్ వర్సిటీ క్యాంపస్‌లో గజజ్యోతి వెటర్నరీ ఫెస్టివల్‌లో భాగంగా వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య డి.ఎన్.రావు డాగ్ షోను సోమవారం ప్రారంభించారు. డాగ్ షోలో గోల్డెన్ రిట్రీవర్, లాబ్రడర్, సెయింట్ బెర్నార్డ్, పోమేరియన్, కేన్ కర్సో, బాక్సర్, బీగెల్, బుల్ మస్టిఫ్, జర్మన్ షెఫర్డ్ వంటి జాతి కుక్కలు పోటీలు పాల్గొన్నాయి. వివిధ జిల్లాల నుంచి 5 బ్రీడ్ డాగ్స్ పోటీలో పాల్గొనగా వాటిలో ఉత్తమ బ్రీడ్ డాగ్‌లకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. వర్సిటీ వెటర్నరీ స్కూల్, యానిమల్ సైన్సెస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రొ.ఆర్.కె.స్వయిని, డైరక్టర్ (అడ్మిన్) డా.దుర్గాప్రసాద్ పాఢి పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా ఒడిశా కెన్నెల్ క్లబ్ అధ్యక్షుడు సుబ్రత్ పృష్టి, వెటర్నరీ డిపార్ట్‌మెంట్ డాక్టర్ ఎం.జి.జయంత్ నాగరాజ్, ఫార్డ్ అసిస్టెంట్ డైరెక్టర్ డా.బిమల్ కుమార్ చౌదరి వ్యవహరించారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹145	₹260	₹ 270

ఉన్నత పాఠశాలల స్థాయి పెంపు

- అందుబాటులోకి ఇంటర్మీడియట్ కోర్సులు
- కో ఎడ్యుకేషన్ అమలుకు చర్యలు


కో-ఎడ్యుకేషన్ హైస్కూల్ ప్లస్ అమలులో ఉన్న ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

విజయనగరం అర్బన్: పేద ప్రజలకు ఇంటర్‌మీడియట్ కోర్సులను అందుబాటులో ఉంచాలనే లక్ష్యం అమలులో భాగంగా ప్రభుత్వం మరో అడుగు వేసింది. రెండేళ్ల క్రితం జిల్లాలో ఒక ఉన్నత పాఠశాలను హైస్కూల్ ప్లస్‌గా స్థాయి పెంచి అమలు చేసింది. రెండేళ్ల తరువాత తాజాగా మరో ఏడు పాఠశాలలను హైస్కూల్ ప్లస్‌గా స్థాయి పెంచి విస్తరించింది. ఈ మేరకు ప్రభుత్వం జీఓ నంబర్ 14 విడుదల చేసి రానున్న విద్యాసంవత్సరానికి ఆయా స్కూళ్లలో ఇంటర్‌మీడియట్ కోర్సులను ప్రవేశ పెట్టాలని ఆదేశాలిచ్చింది. ప్రస్తుతం జూనియర్ ఇంటర్మీడియట్ కళాశాలలు ఉన్న మండలాలలో కాకుండా మిగిలిన మండలాలల్లో ఒక్కో ఉన్నత పాఠశాలలో ఇంటర్‌మీడియట్ కోర్సులను ప్రవేశ పెట్టి ఆయా ఉన్నతపాఠశాలలను హైస్కూల్ ప్లస్‌గా స్థాయి పెంచింది. ఇప్పటికే జిల్లాలోని అన్ని కేజీబీవీలలో ఇంటర్‌మీడియట్ కోర్సులు ప్రవేశ పెట్టారు. అయితే అవి పూర్తిగా బాలికలకు మాత్రమే కావడం వల్ల వాటిని పరిగణనలోకి తీసుకోలేదు. విధిగా కో-ఎడ్యుకేషన్ కళాశాలలుండాలని కేజీబీవీ లున్నప్పటికీ ఆ మండలంలో జూనియర్ కళాశాల లేకపోతే అక్కడ హైస్కూల్ ప్లస్ ఏర్పాటు చేశారు. దీంతో అన్ని మండలాల్లో కో-ఎడ్యుకేషన్ ఇంటర్‌మీడియట్ ఉన్నట్లయింది. జిల్లాలోని 27 మండలాల్లో 17 మండలాల్లో మాత్రమే కో-ఎడ్యుకేషన్ ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. రాజాంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలతోపాటు బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉండడంలో లెక్కప్రకారం 16 మండలాలకే జూనియర్ కళాశాలలు ఉన్నాయి. దీంతో ఇంకా 12 మండలాల్లో ఇంటర్‌మీడియట్ కోర్సుల కళాశాలలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఈ మండలాల్లో ప్రత్యామ్నాయంగా హైస్కూల్ ప్లస్‌లను ఏర్పాటు చేయాలని భావించి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగానే రెండేళ్ల క్రితం తొలుత ఎస్‌కోట మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను హైస్కూల్ ప్లస్‌గా స్థాయి పెంచారు.

వచ్చే విద్యాసంత్సరం నుంచే అమలు



జిల్లాలో 7 ఉన్నత పాఠశాలలకు కో-ఎడ్యుకేషన్ హైస్కూల్ ప్లస్‌గా స్థాయి పెరగనుంది. ఈ మేరకు ప్రభుత్వం జీఓ 14ను విడుదల చేసింది. 2024–25 జూన్ 1 నుంచి ఇంటర్మీడియట్ తరగతులు నిర్వహించనున్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో 40 చొప్పున సీట్లు కేటాయించారు. దీనికి సంబంధించిన ప్రవేశ ప్రకటన త్వరలో వస్తోంది. – ఎన్.ప్రేమకుమార్, డీఈఓ.

స్థాయి పెరగనున్న స్కూళ్లు ఇవే

జిల్లాలో ఇంటర్‌మీడియట్ కోర్సులను ఏర్పాటు చేసే హైస్కూల్ ప్లస్‌లుగా ఏడు ఉన్నత పాఠశాలలను మారుస్తారు. వాటిలో బొబ్బిలి మండలంలోని పిరిడి, బొండపల్లి, గరివిడి మండలంలోని కోనూరు, గుర్ల మండలంలోని తెట్టంగి, జామి, రామభద్రపురం, ఆర్‌ఆమదాల వలస మండంలలోని వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి.

ఇంటి పట్టాతో పూర్తి హక్కు


మహిళలకు సొంతింటి పూర్తిహక్కు పత్రాలను అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- పేదవాడి సొంతింటి కల సాకారమే సీఎం ధ్యేయం
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి పట్టా మంజూరు చేయడమే కాకుండా పూర్తి హక్కు పత్రాలను కూడా అందించడమే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ధ్యేయమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పునరుద్ఘాటించారు. ఈ మేరకు విజయనగరం నగరపాలక సంస్థ కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ పత్రాలను సోమవారం అందజేశారు. నగర పరిధిలో ఉన్న లబ్ధిదారులకు ఇప్పటికే గుంకలాం, జమ్ము, కొండకరకాం, సారిక ప్రాంతాల్లో మొత్తం 19,601 మందికి ఇళ్లపట్టాలను మంజూరు చేశారు. వాటిలో ఇప్పటివరకూ 12వేల తొమ్మిది మంది లబ్ధిదారుల పట్టాలకు రిజిస్ట్రేషన్ పక్రియ కూడా పూర్తయింది. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను లబ్ధిదారులకు అందించడంతో మహిళల్లో ఆనందం వ్యక్తమైంది.

ఈ ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదే

ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి నవరత్నాల రూపంలో పేదలందరికీ ఇళ్ల పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించి అమలుచేశారన్నారు. అంతేకాకుండా ఆయా స్థలాలకు పూర్తి హక్కులను కల్పిస్తూ రిజిస్ట్రేషన్ చేసి, అందజేయడం సరికొత్త విధానమన్నారు. ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియకు రూ.8,668 ఖర్చు కాగా, లబ్ధిదారుల నుంచి ఒక్క రూపాయి కూడా వసూలు చేయకుండా ప్రక్రియను పూర్తిచేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ ముచ్చు లయ యాదవ్, కమిషనర్ ఎం.మల్లయ్య నాయుడు, సహాయ కమిషనర్ తిరుమలరావు, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, హౌసింగ్ కమిటీ సభ్యులు కంటుభుక్త తవిటిరాజు, మారోజు శ్రీనివాసరావు, వివిధ డివిజన్‌ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల్లో ఎల్.కోట విజేత

- క్రీడల్లో రాణిస్తే ఉజ్వలభవిష్యత్తు
- ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు


రసవత్తరంగా సాగుతున్న ఎల్.కోట-కొత్తవలస జట్ల మధ్య పోరు


ఎల్.కోట జట్టుకు ట్రోఫీ, చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తదితరులు

కొత్తవలస: యువత క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆలాగే క్రీడాస్ఫూర్తి కలిగి ఉండాలని అప్పుడే స్నేహభావం పెరిగి పల్లెల్లో ప్రశాంత వాతావరణం నెలకొంటుందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు కొత్తవలస మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో మూడు రోజులుగా శారద మెటల్స్ అండ్ ఎల్లాయిస్ కర్మాగారం ఆధ్వర్యంలో సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ పోటీల్లో జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన 16 జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో మొదటి స్థానంలో లక్కవరపుకోట జట్టు, ద్వితీయ స్థానంలో కొత్తవలస, తృతీయ స్థానంలో విజయనగరం, నాల్గవ స్థానంలో జామి జట్లు నిలిచాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు,శారద కర్మాగారం సీనియర్ జనరల్ మేనేజర్ ప్రభాత్‌మోహన్‌లు విజేత జట్లకు వరుసగా రూ.1.25లక్షలు, రూ.60వేలు, రూ.30వేలు, రూ.25వేలు చొప్పున నగదు బహుమతులు, ట్రోఫీలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. అలాగే పోటీల్లో పాల్గొన్న ప్రతి జట్టుకు ఒక నెట్, రెండుబాల్స్ అందించారు. కార్యక్రమంలో కర్మాగరం ప్రతినిధులు సన్యాసిరావు, జి.శంకరరావు, జాతీయ శిక్షకుడు గవర సూరిబాబు, చీఫ్ కోచ్‌లు ఎం,కృష్ణంరాజు, జాతీయ రిఫరీ ఎల్.జి.ఎస్.కుమార్, పీడీలు బాల, పి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

‘ఆశ’ల సమస్యల పరిష్కారానికి చర్యలు

- డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథరావు


సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథ రావు

పార్వతీపురంటౌన్: ఆశ కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసం చర్యలు చేపడతామని పార్వతీపురం మన్యం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు అన్నారు. ఆశ కార్యకర్తల విధి నిర్వహణ, సమస్యలపై ఆశ నోడల్ అధికారులతో గ్రీవెన్స్ సమావేశాన్ని డీఎంహెచ్‌ఓ అధ్యక్షతన ఆరోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీల వారీగా విధులకు సంబంధించి ఆశ కార్యకర్తల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్ పరిధిలోకి వచ్చే ఆరోగ్య కార్యక్రమాల నిర్వహణ, ఆశ కార్యకర్తల జాబ్ చార్ట్ పరిధిలో లేని విధులు, ఆస్పత్రిలో రాత్రిపూట విధులకు, మందులకిట్లు, వ్యారియర్స్ తీసుకుని వెళ్లడంలో ఇబ్బందులను ఆశ కార్యకర్తలు నివేదించారు. రోగులను రిఫరల్ ఆస్పత్రులకు తీసుకు వెళ్లేటప్పుడు ఆశ కార్యకర్తలకు అక్కడ నిరీక్షణ గది ఏర్పాటు చేయాలని కోరారు. ఈ అంశాలపై సంబంధిత అధికారులతో సమన్వయం చేసి తగు కార్యాచరణ చేపడతామని డీఎంహెచ్‌ఓ అన్నారు. ఆశ కార్యకర్తలకు వారి జాబ్‌చార్ట్ పరిధిలో లేని విధులకు తావివ్వకుండా తగు మార్గ నిర్దేశం చేయాలని నోడల్ అధికారులకు డీఎంహెచ్‌ఓ సూచించారు.

సినీఫక్కీలో దోపిడీ


బాధితుడు శ్రీరామ్మూర్తి నుంచి వివరాలను సేకరిస్తున్న డీఎస్పీ కృష్ణారావు

గరుగుబిల్లి: దొంగలు రోజుకో కొత్త మార్గంలో సినీ ఫక్కీలో చోరీలు, దోపిడీలకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో గరుగుబిల్లి మండలంలోని సంతోషపురం పంచాయతీ ఖడ్గవలస జంక్షన్‌లో రైస్‌మిల్లు యజమాని కమిడి శ్రీరామూర్తినాయుడు ఇంట్లో సోమవారం వేకువ జామున దోపిడీ జరిగింది. దొంగతనానికి వచ్చిన వారు ఇంట్లో ఉన్న భార్యాభర్తలను తాళ్లతో కట్టేసి ఇంట్లోని బంగారం వస్తువులు, నగదు వారి కళ్లముందే చోరీ చేసి దర్జాగా వెళ్లిపోయారు. దొంగతనం బయట పడకుండా ఉండేలా ఇంట్లో సీసీ కెమెరాకు అమర్చిన హార్డ్ డిస్క్‌ను ఎత్తుకుపోయారు. వేకువ జామున నీరు లేదని మోటార్ వేసేందుకు ఇంటి వారు బయటకు రాగా అప్పటికే కాపుకాసి ఉన్న దొంగలు ఇంట్లో చొరబడి భర్యాభర్తలపై దాడి చేసి వారి కాళ్లుచేతులు కట్టేసి దోపిడీకి పాల్పడ్డారు. ఈ ఘటనలో సుమారు 80 తులాల బంగారు ఆభరణాలు, నగదు పోయాయి. బాధితుల ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలానికి పాలకొండ డీఎస్పీ జీవీ.కృష్ణారావు, చినమేరంగి సీఐ మురళీధర్, స్థానిక ఎస్సై అమ్మాన్ రావు చేరుకుని పరిశీలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. వేలిముద్రలు, ఇతర ఆనవాళ్లను క్లూస్ టీమ్ పరిశీలిస్తోంది.

అర్జీలకు శాశ్వత పరిష్కారం

- ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్


పార్వతీపురం: వినతులు స్వీకరిస్తున్న ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్


విజయనగరం అర్బన్: అర్జీలను స్వీకరిస్తున్న సహాయ కలెక్టర్ త్రివినాగ్, డీఆర్ఓ అనిత


విజయనగరం క్రైమ్: ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ ఎం.దీపిక


సీతంపేట: వినతులు స్వీకరిస్తున్న పీవో కల్పనాకుమారి

పార్వతీపురం: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపాలని పార్వతీపురం మన్యం జిల్లా ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ మండల అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆయన కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీఆర్ఓ జి. కేశవ నాయుడు, ఆర్‌డీఓ కె.హేమలతతో కలిసి ప్రజలనుంచి వినతులను స్వీకరించారు. ప్రజల నుంచి వచ్చిన వినతుల పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో మాట్లాడి సకాలంలో పరిష్కరించాలని సూచించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజలు సామాజిక, వ్యక్తిగత అంశాలపై 140 అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథరావు, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, బీసీ వెల్ఫేర్ అధికారి ఎస్.కృష్ణ, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, డీపీఓ బి.సత్యనారాయణ, డీఈఓ పగడాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన స్పందనకు 35 వినతులు

సీతంపేట: ఐటీడీఏలో సోమవారం నిర్వహించిన గిరిజన స్పందనకు 35 వినతులు వచ్చాయి. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో ఏపీవో రోసిరెడ్డి, ఇంజినీరింగ్ ఈఈ సింహాచలం, డీడీ అన్నదొర, డిప్యూటీ ఈవో లిల్లీరాణి తదితరులు పాల్గొన్నారు.

వినతుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ

విజయనగరం అర్బన్: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రభుత్వ శాఖలకు ప్రజల నుంచి అందిన వినతుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించి వాటిని సకాలంలో పరిష్కరించాలని డీఆర్‌ఓ అనిత ఆదేశించారు. ఆయా ప్రభుత్వ శాఖలు తమకు సంబంధించి ఆన్‌లైన్‌లో పంపిన వినతులను పరిశీలించి వాటిపై స్పందించాలని సూచించారు. కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో నిర్వహించిన వినతుల స్వీకరణ కార్యక్రమంలో సహాయ కలెక్టర్ త్రివినాగ్, కేఆర్ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ సుమబాల, మురళీకృష్ణ, ఆర్‌డీఓ సూర్యకళతో కలిసి డీఆర్‌ఓ ఎస్‌డీఅనిత వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై 175 వినతులు అందాయి.

స్పందన ఫిర్యాదుదారులకు తక్షణ న్యాయం

విజయనగరం క్రైమ్: స్పందన కార్యక్రమంలో ఫిర్యాదులు అందజేసే బాధితులకు తక్షణ న్యాయం చేకూర్చే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని ఎస్పీ ఎం.దీపిక ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆమె జిల్లా పోలీసు కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి 41 ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను తెలుసుకుని, సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. బాధితుల సమస్యల పరిష్కారానికి చట్టపరిధిలో చర్యలు చేపట్టి, న్యాయం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, ట్రాఫిక్ డీఎస్పీ డి.విశ్వనాథ్, ఎస్బీ సీఐలు కేకేవీ.విజయనాథ్, ఈ.నరసింహమూర్తి, డీసీఆర్‌బీ ఎస్సై గణేష్, ఎస్సై ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


సోమేష్ మృతదేహం

పూసపాటిరేగ: స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలో ఆదివారం రాత్రి రోడ్డుప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి మృతి చెందాడు. శ్రీకాకుళం జిల్లా సంతకవిటి మండలం మండాకురిటి గ్రామానికి చెందిన కొప్పిశెట్టి సోమేష్(65) పూసపాటిరేగలో జరిగిన తెలగసామాజిక వర్గం మీటింగుకు వచ్చి తిరిగి వెళ్తున్నప్పుడు జాతీయరహదారి దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాల పాలయ్యాడు. దీంతో చికిత్స నిమిత్తం తగరపువలస ఎన్ఆర్ఐ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో మృతిచెందాడు. ఈ మేరకు పూసపాటిరేగ ఎస్సై ఎ.సన్యాసినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్‌షాక్‌తో వ్యక్తి..


బొండపల్లి: విద్యుత్ షాక్‌తో మృతి చెందిన కృష్ణ

గంట్యాడ, బొండపల్లి: బొండపల్లి మండలంలోని గ్రహపతి అగ్రహారానికి చెందిన చప్ప కృష్ణ (45) విద్యుత్ షాక్ కొట్టి మృతి చెందాడు. గంట్యాడ మండలంలోని పెదమజ్జిపాలెం గ్రామ సమీపంలో గ్రీన్ ఫీల్డ్ హైవే పనులకు వెళ్లిన కృష్ణకు విద్యుత్ వైర్లు పొరపాటున తగలడంతో షాక్ కొట్టింది. మృతుని భార్య ఫిర్యాదు మేరకు గంట్యాడ ఎస్సై సురేంద్ర నాయుడు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నూతన కోర్సులతో నైపుణ్యం మెరుగు

- జేఎన్‌టీయూ జీవీ వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య
- జాతీయస్థాయి సాంకేతిక సింపోజియం ప్రారంభం


మాట్లాడుతున్న జేఎన్‌టీయూ జీవీ వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య


వార్షిక సావనీర్‌ను విడుదల చేసిన ముఖ్యఅతిథి విశాఖ స్టీల్‌ప్లాంట్ జీఎం (డీఈఅండ్ ఈపు) కె.వాణిశ్రీ

విజయనగరం అర్బన్: పరిశోధన రంగంలో వస్తున్న ఆధునికతకు అనువైన నూతన కోర్సులను నేర్చుకుని నైపుణ్యం మెరుగుపరచుకోవాలని జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య అన్నారు. ఈ మేరకు స్థానిక ఇంజినీరింగ్ కళాశాల ఈఈఈ విభాగం ఆధ్వర్యంలో రెండురోజులపాటు నిర్వహించే జాతీయ స్థాయి సాంకేతిక సింపోజియం సదస్సును సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్య స్థాయిలోనే సంబంధిత విద్యతోపాటు ఉద్యోగ, ఉపాధి నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. అందుకు సంబంధించిన ఇలాంటి సదస్సులలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన విశాఖ స్టీల్ ప్లాంట్ జీఎం (డీఈఅండ్ఈపి) కె.వాణిశ్రీ మాట్లాడుతూ రానున్న సాంకేతిక అభివృద్ధికి ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) కీలకంగా నిలుస్తుందన్నారు. అందుకు అవసరమైన మానవ శక్తి డిమాండ్‌ను నేటి యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వార్షిక సావనీర్‌ను వీసీ ప్రొఫెసర్ వెంకటసుబ్బయ్య ఆవిష్కరించారు. అనంతరం ముఖ్యఅతిథిని ఘనంగా సత్కరించారు. ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ ఎ.పద్మజ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీకుమార్, సదస్సు కన్వీనర్ డాక్టర్ వీఎస్.వకుళ, ఫాకల్టీ కోఆర్డినేటర్స్ పి.శ్రీనివాసరెడ్డి, టి.శిరీష, విద్యార్థి కో ఆర్డినేటర్ వి.దయాకర్, రాము, డి.విజయశ్రీ, పి.కల్యాణి, వివిధ కళాశాలల నుంచి 450 మంది విద్యార్థులు పాల్గొన్నారు.